క్లుప్తంగా

రంజిత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో బాలకిషన్, అరవింద్

హుడాకాంప్లెక్స్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాంపై చర్చించినట్లు తెలిపారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల నుంచి భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేస్తామని వారు ప్రకటించారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీ కుందుకూరు మండల కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు పెద్దమ్మ తల్లి దేవాలయం వెనక ఉన్న ఫంక్షన్‌హాల్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పి.ఆనంద్ పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్

తుక్కుగూడ: రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు చింతల సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉన్నారు.

తుక్కుగూడలో కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న సీతారంజిత్‌రెడ్డి

తుక్కుగూడ: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపును కోరుతూ బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి సతీమణి సీత పాల్గొని ఇంటింటా తిరిగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తన భర్తను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, సమత, పద్మ, యాదయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గంలోని మండలాలు, డివిజన్లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలను పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ బుధవారం నియమించారు. మహేశ్వరం మండలం- దేప భాస్కర్‌రెడ్డి, కందుకూరు మండలం-అమరేందర్‌రెడ్డి, తుక్కుగూడ- జగన్, జల్‌పల్లి-చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ బొక్క జంగారెడ్డి, మీర్‌పేట్ బండారి సత్యనారాయణ, సరూర్‌నగర్ డివిజన్ ఏనుగు జంగారెడ్డి, ఆర్‌కేపురం- సభావత్ కృష్ణా నాయక్‌లను పార్టీ నియమించింది. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఆయా మండలాలు, డివిజన్లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని అధిష్టానం ఆదేశించింది. మహేశ్వరం నియోజకవర్గంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీ తీసుకొస్తామని నియమితులైన నాయకులు పేర్కొన్నారు. వీరితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డిలు నియమితులైన నేతలకు సమన్వయంగా పని చేస్తారు.

నిధులు రాక.. పనులు సాగక



అసంపూర్తిగా జీపీ భవన నిర్మాణ పనులు

అసంపూర్తిగా ఎత్‌మార్‌పల్లి జీపీ భవనం

- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మొయినాబాద్ రూరల్: గత ప్రభుత్వంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు పాలన భవనాలు లేక సిబ్బంది, ప్రజాప్రతినిధులు అవస్థలు పడ్డారు. ఐదేళ్ల క్రితం కొత్తగా ఏర్పడి అనుబంధ గ్రామాలుగా ఉన్న జీపీలకు ఆయా గ్రామాల్లో ఉన్న యువజన భవనాలు, డ్వాక్రా భవనాలను పంచాయతీ పాలన కోసం అప్పట్లో ఉపయోగించుకున్నారు. దీంతో ఆ భవనాల్లో గదులు చిన్నగా ఉండడంతో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామం కొత్త జీపీగా గత ప్రభుత్వంలో ఏర్పడింది. ఈ గ్రామం అప్పట్లో నక్కలపల్లి జీపీకి అనుబంధ గ్రామంగా ఉండేది. తండాలు, చిన్న అనుబంధ గ్రామాలను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ అమలు చేసింది. అందులో భాగంగా ఎత్‌మార్‌పల్లి డ్వాక్రా భవనంలో గ్రామ పంచాయతీ పాలన నాలుగు సంవత్సరాల పాటు కొనసాగింది. ప్రభుత్వం ద్వారా నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ.20 లక్షలను మంజూరు చేసింది. దీంతో అప్పటి సర్పంచ్, పాలకవర్గంతో కలిసి తీర్మానం చేసి నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పురాతన భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఆరునెలల నుంచి పనులు పిల్లర్ల వరకు కొనసాగింది. దాదాపు రూ.8లక్షల వరకు ఖర్చు చేసి పనులు చేసి నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ఆరునెలల నుంచి చేపట్టాం. పిల్లర్ల వరకు పూర్తయ్యాయి. నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. అందులో రూ.8 లక్షలు ఖర్చు చేశాం. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. ప్రభుత్వం పరిశీలించి వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– నవనీతరాజు, మాజీ సర్పంచ్, ఎత్‌మార్‌పల్లి

బిల్లులు పంపించాం



మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నూతనంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు పిల్లర్ల వరకు పూర్తయ్యాయి. చేసిన పనుల నిధులకు బిల్లుల కోసం నివేదికలు పంపించాం. ప్రభుత్వం ద్వారా బిల్లులు వస్తే భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

కందుకూరు: మండలంలోని ధన్నారం, బాచుపల్లి, బేగరికంచె, వావిళ్లకుంటతండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సమక్షంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హస్తంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చొరవ తీసుకుంటానన్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ధన్నారం మాజీ ఉపసర్పంచ్ మంద నర్సింహ, బీఆర్‌ఎస్ మాజీ ఎస్టీసెల్ అధ్యక్షుడు జరుపుల రూప్లానాయక్, నాయకులు పర్వతాలు యాదవ్, శ్రీకాంత్, నగేశ్, రాజప్ప, జె.రాజు, గణేశ్, రమేశ్, గోపి, కిరణ్ తదితరులకు కేఎల్లార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతనరసింహారెడ్డి, పీసీసీ సెక్రటరీ ఎల్మటి అమరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీదేవిశేఖర్‌రెడ్డి, సాయిలు, దేవిపాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌ముదిరాజ్, జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, మల్లయ్య, మల్లేశ్‌యాదవ్, గణేశ్‌నాయక్, యాదగిరి, పర్వతాలు, ధన్‌రాజు పాల్గొన్నారు.



వనస్థలిపురంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులతో మధుయాష్కీ గౌడ్, రినీష్‌రెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా చేపట్టాల్సిన ప్రచారంపై బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 10 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో సునీత మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 16న ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తారని, అందుకు తగ్గట్టుగా తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు.కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షుడు మకుటం సదాశివుడు,లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహ యాదవ్, వేణుగోపాల్ యాదవ్,గజ్జి శ్రీనివాస్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, సత్యనారాయణ, మంజులారెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దీపక్ జాన్

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం ఆధ్వర్యంలో బుధవారం మూసారంబాగ్ షాలోమ్ టెంపుల్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులకు అందిస్తున్న పథకాలపై పాస్టర్లకు, చర్చి పెద్దలు, క్రైస్తవ నాయకులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా పొందాలో వివరించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాస్టర్లు, పెద్దలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. షాలోమ్ టెంపుల్ చైర్మన్ డాక్టర్ పి. సాల్మన్‌జోబ్స్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిజామాబాద్ వీపీఎం చర్చి పాస్టర్ రెవరెండ్ జెకరియా ఆనంద్ ప్రసంగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైస్ ప్రెసిడెంట్ సంతు, ప్రధాన కార్యదర్శి అనిత షిబారాణి, కోశాధికారి శ్రీధర్‌రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నవీన్, జయరాజ్, సామేల్, యేసురత్నం, క్రిస్టోఫర్, యిర్మియా, జెకరియా, తదితరులు పాల్గొన్నారు.

బాల్‌రెడ్డి సేవలు పేదల మదిలో పదిలం

సామ రమణారెడ్డి

చంపాపేట: చంపాపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మూడు దశాబ్దాల పాటు నిబద్ధతతో విధులు నిర్వర్తించిన దివంగత సామ బాల్‌రెడ్డి సేవలు పేదల మదిలో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామ రమణారెడ్డి అన్నారు. బుధవారం బాల్‌రెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా చంపాపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయకులు సామ నర్సింహారెడ్డితో కలిసి బాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ...బాల్‌రెడ్డి సర్పంచ్‌గా విధులు నిర్వర్తించే కాలంలోనే తన మిగులు భూమిని పేదల ఇళ్ల కోసం పంచి పెట్టారన్నారు. ఆయా ప్రాంతాలలో రోషన్‌దౌలా, నేతాజీ నగర్, ముస్లిం బస్తీ, సుల్తానా అల్వా, కటకోనికుంట వంటి కాలనీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కూడా కల్పించిన ఘనత ఆయనకే దక్కిందని గుర్తు చేశారు. సామ బాల్‌రెడ్డి ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. అనంతరం చంపాపేట చౌరస్తాలో బాల్‌రెడ్డి కుమారుడు సామ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఐదు వందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సామ గౌతమ్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కట్టా వెంకటేష్, మంత్రి జగన్, రఘునందన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సారయ్య, శంకర్, గోవర్ధన్ రెడ్డి, నేతాజీ యువజన సంఘ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్ పాల్గొన్నారు.



సామ బాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సామ రమణారెడ్డి

రంజాన్‌కు సిద్ధమైన ఈద్గాలు



మామిడిపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న హిందూ ముస్లింలు



జల్‌పల్లిలో ఈద్గా వద్ద శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



వాదే ముస్తఫాలో..

- ఈదుల్ ఫితర్ పర్వదినం వేళ ప్రత్యేక ప్రార్థనలు

పహాడీషరీఫ్: పవిత్ర రంజాన్ మాసంలో ఈదుల్ ఫితర్ పండగను పురస్కరించుకొని ప్రార్థనలు నిర్వహించేందుకు వచ్చే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా ఈద్గాలు, మసీదుల వద్ద జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈద్గాలకు సున్నాలు వేయించడంతో పాటు చెత్తా చెదారాలు లేకుండా పారిశుద్ధ్య సిబ్బంది శుభ్ర పరిచారు. జల్‌పల్లి, వాదే ముస్తఫా, కొత్తపేట, పహాడీషరీఫ్ ఈద్గాలను మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు భూపతి, గురువారెడ్డి గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇక పండుగ చివరి రోజు కావడంతో ముస్లింలు పెద్ద ఎత్తున షాపింగ్ చేస్తూ కనిపించారు. దీంతో ప్రధాన రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. చివరి రోజు ఇఫ్తార్ విందులు కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మాజీ స్పీకర్ పరామర్శ

మంచాల: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు డబ్బికార్ శ్రీనివాస్‌ను రాష్ట్ర మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి బుధవారం ఆరుట్లలో పరామర్శించారు. ఇటీవల డబ్బికార్ శ్రీనివాస్ తల్లి చనిపోయిన విషయం తెలిసిందే. మధుసూదనాచారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, మాజీ డైరెక్టర్ జానీ పాషా, జిల్లా నాయకులు రఘుపతి, శ్రీనివాస్‌గౌడ్, మహేష్, నిఖిల్ గౌడ్, మల్లాజీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

చాదర్‌ఘాట్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలు జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు కోరారు. బుధవారం స్టేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ, వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శ్రీరామనవమి శోభాయాత్రపై నిర్వాహకులతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ కూడా అమలులో ఉన్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాబేజీ 20, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 23, దొండ 19–23, చిక్కుడు 50, గోకర 23, బీట్‌రూట్ 21. క్యాప్సికం 70, ఆలు 31, దోస 17, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

క్రీడా మైదానం.. నిరుపయోగం!

- నిర్వహణ పట్టించుకోని గ్రామ పంచాయతీలు
- అందుబాటులోకి తేవాలంటున్న స్థానికులు



జాపాలలో నిరుపయోగంగా మారిన క్రీడా మైదానం

మంచాల: గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా మైదానాలు నేడు నిరుపయోగంగా మారాయి. కంపచెట్లు, మొక్కలు పెరగడంతో ఆటలు ఆడేందుకు అనువుగా లేకుండా ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో శ్మశాన వాటికలు, నర్సరీలతో పాటు ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మంచాల మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో, 12 గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. అయితే 9 గ్రామాల్లో ఇంకా పనులు పురోగతిలో ఉన్నాయి. అస్మత్‌పూర్, కాగజ్‌ఘాట్ గ్రామాల్లో స్థలం వివాదంలో ఉండటంతో ఇంకా ఏర్పాటు చేయలేదు. ఒక్కో క్రీడా మైదానం ఏర్పాటు కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.50 వేల నుంచి లక్ష రూపాయాల వరకు ఖర్చు పెట్టారు.

నెరవేరని లక్ష్యం..

భారీ మొత్తంలో వ్యయం చేసి ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నేడు చాలావరకు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం క్రీడా మైదానంలో ఆట వస్తువులు గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశామని చెబుతుంది. ప్రజలు మాత్రం సక్రమంగా సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ప్రభుత్వ ఉద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల ఏర్పాటు ప్రక్రియ నీరుగారిపోతుంది. ఇప్పటికైనా గ్రామాల్లో యువత ముందుకు వచ్చి క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆటస్థలాలను ప్రజలు వినియోగించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.చాలా గ్రామాల్లో పేరుకే ఆటస్థలం కేటాయించారు.ఆట వస్తువులను ఇవ్వలేదు.టెన్నీస్, వాలీబాల్ వంటి క్రీడలు ఆడుకునే విధంగా చూడాలి.

– భాస్కర్ గౌడ్, జాపాల

పంచాయతీలకు అప్పగించాం



ప్రభుత్వం క్రీడా మైదానాల ఏర్పాటు చేసింది. ఆట స్థలాలు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా వస్తువులు కూడా అందించాం. అయితే వాటిని గ్రామ పంచాయతీలకు అప్పగించాం. వాటి నిర్వహణ బాధ్యత పంచాయతీలదే.

– తేజ్‌సింగ్, ఎంపీఓ, మంచాల